31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం, ఆగస్టు 02, 2026 పేజీలు : 8

## గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి



**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఆగస్టు 1 :** గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం గొల్లపల్లి మండల కేంద్రంలో 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల సిఫ్టింగ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలిసి పనులను ప్రారంభించి, వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గొల్లపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదల కోసం సుమారు రూ. 74 లక్షలతో విద్యుత్ తీగల సిఫ్టింగ్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో

-మిగతా 2లో





## ఉత్తర తెలంగాణ రైతులకు

# గరిష్ట సాగునీరు అందించడమే లక్ష్యం



**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నాం**

**ఎల్లంపల్లి రిజర్వాయర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన ప్రాజెక్టు**

**మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయొద్దని ఎన్‌డీఎస్‌ఏ సూచించింది**

**ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రులు**

**ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**చురకలు ప్రతినిధి, కమాన్‌పూర్ ఆగస్టు 1 :** ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గోదావరి నదిపై నిర్మితమైన వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి

-మిగతా 2లో

## రోళ్లవాగుకు

# షట్టర్లను వెంటనే బిగించాలి

**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు విలేకరి, బీర్పూర్, ఆగస్టు 1:** రోళ్లవాగుకు షట్టర్లను వెంటనే బిగించాలని, షట్టర్లను బిగించడంలో నిర్లక్ష్యం సరికాదని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. బీర్ పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్బంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ బీర్పూర్ మండల కేంద్రంలోని రోళ్లవాగు ప్రాజెక్టు 0.25 టిఎంసి సామర్థ్యం సరిపోవడం లేదని, తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో సీఎం కేసీఆర్ దీనిని 1టిఎంసికి పెంచి మంజూరు చేశారని, దశాబ్దం గడిచినా పనులు పూర్తి కాలేదని విమర్శించారు. గత రబీలో గేట్లు, షట్టర్లు అమరుస్తామని అధికారులు చెప్పినా ఇప్పటివరకు జాప్యం జరిగిందన్నారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్నా, అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం వల్ల ఇన్స్ట్రక్షన్ పార్ట్ బ్రీచ్ అయి నీరంతా కిందికి జారిపోయిందని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి

-మిగతా 2లో




## ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం

# పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

- **ఎస్ఐఆర్ గడువు 10 వరకు పొడిగింపు**
- **17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, ఆగష్టు 01:** ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతబద్ధీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పోలింగ్ స్టేషన్ల హేతబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు

-మిగతా 2లో

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 1 :** ధర్మపురి మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 10 మంది లబ్ధిదారులకు సుమారు రూ.10 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘునబట్ల దినేష్, తహసీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, ఎంపిడిఓ పత్తి రవీందర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా

## వెంటనే మరమ్మతులు చేయాలి



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు1:** ప్రజల కు రాక పోకలకు ఇబ్బందులు లేకుండా వెంటనే మరమ్మతులు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలంలోని తుమ్మేనాల- నర్సయ్యపల్లె గ్రామాల మధ్య ఉన్న రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల ధాటికి కొట్టుకుపోగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం అధికారులతో కలిసి దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారి దెబ్బతిన్న కారణంగా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడిన విషయాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో పరిస్థితిని సమీక్షించిన ఆయన, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే తాత్కాలిక రాకపోకల ఏర్పాట్లు చేయాలని, అనంతరం శాశ్వత మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులపై నిరంతరం నిఘా ఉంచాలని, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘునబట్ల దినేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, సర్పంచ్ లు పోతంశెట్టి నర్సయ్య, రాందేని మోగిలి, నాయకులు సుముక్, జాజల రమేష్, అసెట్టి శ్రీనివాస్, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

## రోళ్లవాగుకు షట్టర్లను వెంటనే బిగించాలి

**మొదటి పేజీ తరువాయి....**మంత్రి అడ్లూరి బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్, ఎరువులు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. యూరియా బ్లాక్ లో రూ.600కు అమ్ముతున్నారని, ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు. యూరియాపై ఉన్న ఆంక్షలు వెంటనే తొలగించాలని కోరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అనుమతి ఉమ్మడి ఏపీలో రాజశేఖర్ రెడ్డి ఇచ్చినా, 2016లో అమలు చేసింది కేసీఆరన్న, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో రెండు పియర్లు కుంగి 30 నెలలు అవుతున్నా మరమ్మతులు చేయలేదని విమర్శించారు. గాయత్రి పంప్ హౌస్ నుండి వరద కాలువకు నీరు ఎత్తిపోస్తున్నామని చెబుతున్నా రాంపూర్ వరకే వచ్చిందన్నారు. వాతావరణ శాఖ ఎల్నినో ప్రభావం గురించి 6 నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, సన్న వడ్ల నారు పోయించి ఇప్పుడు ఆరుతడి పంటలు వేయమనడం రైతులను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. బీర్పూర్ మండలం కొల్వాయి, మంగళ గ్రామాల లిఫ్టులు ట్రాన్స్ఫార్మర్లు లేక ఆగిపోయాయని, కమ్మనూరు, రేకులపల్లి, ఆరెపల్లి లిఫ్టులను వెంటనే ఆపరేట్ చేయాలని, లేకుంటే రైతులు రోడ్డెక్కుతారని హెచ్చరించారు. రోళ్లవాగుకు వెంటనే షట్టర్లు బిగించి రైతులు, మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. అనంతరం దావ వసంత సురేష్ మాట్లాడుతూ రోళ్లవాగు ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు జీవనాధారమని, కేసీఆర్ హయాంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెబుతున్నా, 2 ఏళ్లుగా ఒక్క షట్టర్ కూడా బిగించలేదని విమర్శించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్తర్వులు తెచ్చినా ఆగస్టులో వర్షాలున్నా ఒక్క తలుపు కూడా పెట్టలేదన్నారు. షట్టర్లు బిగించి నీరు నిల్వ చేస్తే రెండు పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు.

# ఉత్తర తెలంగాణ రైతులకు..

**మొదటి పేజీ తరువాయి...** వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జూలై 28న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో మెజారిటీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టుకు దివంగత శ్రీపాదరావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారుఎల్లంపల్లి రిజర్వాయర్ అప్పటి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల వల్ల సాధ్యపడలేదన్నారు.జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు. ఇటీవల జరిగిన సాంకేతిక సమావేశంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్‌డీఎస్‌ఏ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారని పేర్కొన్నారు.డీపీఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిపారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు.ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయని, రైతులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోందన్నారు.కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డీఎస్‌ఏ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడిన వేనని పేర్కొన్నారు.కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ,లి కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయని అన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశమున్నప్పటికీ భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపాయల విద్యుత్ వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొందించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు , మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం

# పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

**మొదటి పేజీ తరువాయి....** సంబంధించిన షెడ్యూల్, ఓటర్ల నమోదు, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు.జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 549 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.ఇందులో వేములవాడ నియోజకవర్గంలో 262, సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు లేవని తెలిపారు.ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, ఇప్పటికే జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ 87.42 శాతం పూర్తయిందని వివరించారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదై ఉండరాదని జిల్లా కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా, అదే నియోజకవర్గం లేదా ఇతర నియోజకవర్గానికి ఓటును బదిలీ (షిఫ్టింగ్) చేసుకోవాలనుకునే వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 17వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఈ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సహకారం అందించాలని అన్నారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి.కుమారి, పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

**మొదటి పేజీ తరువాయి.....** విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లను మంజూరు చేసిందని, అందులో గొల్లపల్లి మండలానికే దాదాపు రూ.2.3 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భీవ సంతోష్, సర్పంచ్ నల్ల నీరజ, పార్టీ అధ్యక్షులు రా పల్లె గంగన్న, నిశాంత్ రెడ్డి సర్పంచులు మాయ సర్పంచులు కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 1 :** జిల్లాలోని పలు అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం, రాజా నగర్ లోని కల్వర్ట్, వీరాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని, నిర్మాణాలన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఆగస్టు 31 లోగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కృష్ణ నాగార్జున, ఎంపిడివో చిరంజీవి,సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు,మహిళా సంఘాల సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 01 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవుపేట, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పది వేలవిలువచేసే స్పోర్ట్స్ డ్రెస్ లను కానిస్టేబుల్ బచ్చుల రాజేష్ అందజేశారు.ఇతను గతంలో ఎన్నో రకాలుగా పాఠశాలకు తనవంతుగా ఆర్థిక సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పాఠశాలలో విద్యార్థుల తోకలిసి మొక్కలు నాటారు.కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నల్ల తిరుపతి,ఉప సర్పంచ్ కొర్రి గంగయ్య,పంచాయతీ సెక్రెటరీ వెంకటేష్ అంబేద్కర్ సంఘంఅధ్యక్షులు బచ్చుల స్వామి,సుమన్,ప్రధానోపాధ్యాయులు వనజ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తల్లిదండ్రులు,గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా దొడ రానా ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు,01 :** ధర్మారం గ్రామంలో దొడ రానా ప్రతాప్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో దొడ రానా ప్రతాప్ రెడ్డి తండ్రి దొడ లింగారెడ్డి విద్యార్థులకు స్వయంగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భగవద్గీతలోని విలువలను ఆచరిస్తూ మంచి నైతిక విలువలు, క్రమశిక్షణ, సంస్కారాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి, ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు బాలు, మహేష్, ఏఎంసీ డైరెక్టర్ బాపురెడ్డి, లింగారెడ్డి, విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు అందిస్తాం

**-సంచార జాతుల నివాస స్థలాల పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నర్సింహారావు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (01) :** అర్హులైన సంచార జాతుల కుటుంబాలకు ప్రభుత్వం నిబంధనల మేరకు ఇండ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపడుతుందని మెట్‌పల్లి ఆర్డీవో నర్సింహారావు తెలిపారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ధర్మరస్వామి కాలనీలో సంచార జాతుల కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతాన్ని,ప్రభుత్వ స్థలంను శనివారం తహసీల్దార్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.కాలనీలోని నివాస స్థలాలు,ప్రభుత్వ భూములు,కుటుంబాల నివాస పరిస్థితులు, భూ సంబంధిత వివరాలను పరిశీలించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు.రహదారులు,తాగునీటి సౌకర్యం,విద్యుత్, పారిశుధ్యం వంటి అంశాలను పరిశీలించి,సమస్యలను గుర్తించి త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సంచార జాతుల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా,వాటిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని,అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రేవంత్ రెడ్డి, సర్వేయర్ రమేష్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాలలో వైద్య సదుపాయాల విస్తరణకు కృషి

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 1 :** జగిత్యాల పట్టణంలో వైద్య సదుపాయాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.శనివారం పట్టణంలోని మోతే రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జగిత్యాల పట్టణానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.80లక్షల 60 వేల విలువగల చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక చేయూత అందిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలోనే అత్యధిక సీఎం సహాయ నిధి చెక్కులు జగిత్యాలకు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు.రాష్ట్రంలో జిల్లా నడి బొడ్డున ఉన్న ఏకైక మెడికల్ కళాశాల జగిత్యాలలో ఉందని,సాధారణంగా 600 పడకలు ఉండాల్సిన చోట జగిత్యాల మెడికల్ కళాశాలకు 800కు పైగా పడకలు అందుబాటులోకి రానున్నాయనయన్నారు.డిప్లమా ఇన్ ఈసీజీ, డయాలసిస్, పారామెడికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, నర్సింగ్ కళాశాల ద్వారా స్టాఫ్ నర్సులు కూడా అందుబాటులో ఉన్నారన్నారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, మాతా శిశు ఆసుపత్రి ప్రారంభోత్సవం రోజున అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని జగిత్యాలలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని, రాష్ట్రంలోనే ఏకైక ట్రామా సెంటర్‌గా జగిత్యాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపాదనలు కేంద్రానికి పంపామని తెలిపారు. పాత బస్టాండ్‌లో ట్రామా సెంటర్, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని,ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యాలను పెంచామని, పారామెడికల్ కోర్సులను మరింత విస్తరిస్తామన్నారు. ట్రామా సెంటర్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర చికిత్స అంది ప్రాణాపాయం తప్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజెంగి నందయ్య, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, ముజీబ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం,గోలి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, ఆడువాల లక్ష్మణ్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దూమల రాజ్ కుమార్, కౌన్సిలర్లు అరవ లక్ష్మి,రాజు,దయల చంద్ర కళ,శంకర్,జిల్లా,పట్టణ యూత్ అధ్యక్షులు భీరం రాజేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభివృద్ధికి విద్య ఎంతో అవసరం

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 1:** పాఠశాలలోని విద్యార్థులు ఉన్నత స్థాయి అభివృద్ధికి విద్య ఎంతో అవరమని, విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగ గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను,వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు,మౌలిక సదుపాయాల తీరును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని హాజరు పట్టికను పరిశీలించారు.పాఠశాలలోని ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించాలని, సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని తెలిపారు.విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి వారి బోధన స్థితిగతులను ప్రత్యేకంగా పరిశీలించారు. తరగతుల నిర్వహణ,పారిశుధ్య సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూప్రకారం భోజనం అందుతున్నదా, లేదా అనే విషయాన్ని పిల్లలను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని,భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిదంగా ఒప్పంద నిర్వాహకుడితో మాట్లాడి నాణ్యతతో కూడిన సరుకులు అందించాలని తెలిపారు.పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించి ఆగష్టు 31 లోగా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో డిఈఓ కె. రాము, తహసీల్దార్ నాగార్జున, ఎంపిడివో చిరంజీవి, ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలసదన్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి




**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 1 :** జగిత్యాల పట్టణంలోని బాలసదన న్ను శనివారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి నాగేశ్వర్రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్గి ఉండి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులకు బాలల సంరక్షణ, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్య, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కె.చంద్రమోహన్, ఆర్.విజయ కృష్ణ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అనురాధ, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగిత్యాలలో మూడు రైస్ మిల్లులపై కేసు

**-రూ.87.89 కోట్ల ప్రభుత్వ సిఎంఆర్ ధాన్యం దుర్వినియోగం**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 1 :** ప్రభుత్వ కస్టమ్స్ మిల్లింగ్-సిఎంఆర్ కోసం అప్పగించిన ధాన్యాన్ని దుర్వినియోగం చేసి రూ.87.89 కోట్లకు పైగా ప్రభుత్వానికి నష్టం కలిగించిన ఘటనలో జగిత్యాల రూరల్ మండలం పరిధిలోని 3 రైస్ మిల్లులపై జగిత్యాల రూరల్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తెలంగాణ స్టేట్ గిడ్డంగులు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ జగిత్యాల జిల్లా మేనేజర్ అర్రగోవుల జితేంద్ర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి శివారులోని మూడు రైస్ మిల్లులపై కేసు నమోదైనట్లు జగిత్యాల రూరల్ సీఐ తెలిపారు. శ్రీ అభయాంజనేయ సాయి ఇండస్ట్రీస్ యాజమానులు కొండ లక్ష్మణ్, కొండ ప్రణీత్, శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్ యాజమానులు కొండ ఉపేంద్ర, కొండ అరుణ, శ్రీ లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్ యాజమానులు కొండ అరుణ, కొండ ఉపేంద్రలపై ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ధాన్యాన్ని అక్రమంగా దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. సంబంధిత నిందితులపై పలు సెక్షన్ల కింద జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వ ధాన్యం,ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,ఎవరినీ ఉపేక్షించబోమని జగిత్యాల రూరల్‌సీఐ హెచ్చరించారు.

## కోనేరులో పడి మున్సిపల్ కార్మికుడు మృతి


**-బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్న మున్సిపల్ చైర్మన్**



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఆగస్టు 1 :** మెట్ పల్లి పట్టణంలోని శ్రీ చెన్నకేశవ ఆలయ కోనేరులో ప్రమాదవశాత్తు పడి ఇందిరానగర్కు చెందిన మున్సిపల్ కార్మికుడు కాంపెల్లి పోచయ్య (57) మృతి చెందారు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై సమాచారం అందుకున్న కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్ల సూరి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి వారి సహాయంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రికి తెలియజేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, పలువురు వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆస్పత్రి వద్ద మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపిన చైర్మన్, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే చొరవతో వరద కాలువలోకి నీరు

**-గంగమ్మకు ప్రత్యేక పూజలు.. రైతుల సంక్షేమం కోసం కొండగట్టు గిరి ప్రదక్షిణ**



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 1 :** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో రాంపూర్ పంప్ హౌస్ ద్వారా వరద కాలువలోకి నీటిని విడుదల చేశారు.దీంతో మల్యాల మండలంలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చింది. నీటి విడుదల సందర్భంగా మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గంగమ్మతల్లికి పూలు,పసుపు, కుంకుమ లతో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు.సాగునీటి కోసం ప్రత్యేక చొరవ చూపినఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధి గా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని గిరిప్రదక్షిణ నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగావర్షాలు కురవాలని ,రైతుల పంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమైనా రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సాగు నీటిని అందించే చర్యలు చేపడుతోంద న్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా సాధ్యమైందని,రైతుల సంక్షేమ మేప్రభుత్వప్రధానలక్ష్యమని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**-తపస్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు**

**-హైదరాబాద్‌లో తపస్ ఆధ్వర్యంలో మహా ధర్నా**

**జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 1 :** పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తపస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ప్రసాద్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో ప్రసాద్ రావు మాట్లాడుతూ 6 డీఏ లు వెంటనే విడుదల చేయాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్ సీ ని తక్షణమే ప్రకటించాలని కోరారు.సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపిఎస్ ను అమలు చేయాలని, మోడల్ స్కూల్, కేజీబి ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వ కార్యక్రమాలను




స్తంభింపజేస్తామని ప్రసాద్ రావు, తపస్ సభ్యులు హెచ్చరించారు.ఈ ధర్నాలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్, రాష్ట్ర బాధ్యులు బోనగిరి దేవయ్య, మల్హాల్ రావు, అందే శివప్రసాద్, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షులు ఆయిల్ ఐలేని నరేందర్ రావు, జిల్లా బాధ్యులు ప్రేమ్ కుమార్, రమేష్, బండి మహేష్, మహిళా కన్వీనర్ భాగ్యలక్ష్మి, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు సహా తపస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హుజురాబాద్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్

# రాజలింగ మూర్తి సేవలు ప్రశంసనీయం

**-హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా రాజలింగమూర్తికి ఘన సన్మానం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్ట్ 1 :** న్యాయ శాఖలో 37 సంవత్సరాల సుదీర్ఘకాలం పనిచేసి సీనియర్ సూపరింటెండెంట్ గా ఉద్యోగ విరమణ చేసిన పందిళ్ళ రాజలింగ మూర్తి అందించిన సేవలు ప్రశంసనీయమని హుజురాబాద్ సబ్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన రాజలింగ మూర్తి సన్మాన కార్యక్రమం శుక్రవారం రాత్రి స్థానిక హుజురాబాద్ క్లబ్ లో జరిగింది. కోర్టు న్యాయ మూర్తులు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి కుమారి పద్మ సాయిశ్రీ, రెండో స్థానాలు జూనియర్ సివిల్ జడ్జి వీణ ప్రణతితో పాటు ఉద్యోగులు,సిబ్బంది, న్యాయవాదులు, కుటుంబ సభ్యులు ఉద్యోగ విరమణ చేసిన రాజలింగ మూర్తి, భారత లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భం గా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాజలింగ మూర్తి సుదీర్ఘకాలం హుజురాబాద్ కోర్టులో పని చేయడం గొప్ప విషయమన్నారు. ఆయన అంకితభావంతో, క్రమశిక్షణతో పని చేశారని 1989లో కాపిస్ట్‌గా చేరి తన పని తీరుతో పదోన్నతులు పొంది, ఎంతో మంది జడ్జిలకింద పని చేశారని ,అందరి ప్రశంసలు అందుకున్నారని మచ్చలేకుండా విధులు నిర్వహించారని అన్నారు. సీనియర్ సూపరింటెండెంట్ గా ఆయన చదువుకున్న హుజురాబాద్ లోనే ఉద్యోగ విరమణ చేయడం హర్షనీయమని అన్నారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ ఉంటుందని.. కానీ వారు పని చేసిన కాలంలో అందించిన సేవలు అందరికీ హృదయాల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతాయని అన్నారు. రాజలింగమూర్తి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ సూపరింటెండెంట్ రాజలింగమూర్తి మాట్లాడుతూ.. న్యాయాధికారుల, ఉద్యోగుల, న్యాయవాదుల, సిబ్బంది సహకారంతోనే తనకు మంచి పేరు వచ్చిందని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘకాలం హుజురాబాద్ లోనే పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఇక్కడి ఉద్యోగుల సహకారం మరువలేనిదని గుర్తు చేశారు. తనకు సహకరించిన న్యాయాధికారులు న్యాయవాదులు ఉద్యోగులు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కరీంనగర్ హుజురాబాద్ కోర్టుల సిబ్బంది, కుటుంబ సభ్యులు పందిళ్ళ విజేందర్ శర్మ, భాస్కర్ శర్మ, మల్లినాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి

**-ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి**

**-ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి), ఆగస్టు 01 :** ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని మస్జిదే పర్వీన్ సుల్తాన నిర్వహించిన ఇస్ దౌర్ మే బాతిల్ ఫిత్నోసే అప్నే ఈమాన్ కో కైసే బచాయే అనే అంశంపై నిర్వహించిన జల్సా ఆధ్యాత్మిక సదస్సు పెద్దఎత్తున విజయవంతం అయింది. ఈసందర్భం గా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేడని,విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు. ఇజ్రాయిల్,ఆంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో,వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని,షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు,పండితులని నమ్మి, వారిబారిన పడి,ఇస్లాం, ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని,ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుంద న్నారు.ఖాధియాని,షకిలియత్ వర్గాలను స్వీకరించి,వారుచెప్పిన బాటలో నడుస్తూ జీవితం గడిపి,ఒకవేళ మరణిస్తే కాఫీర్‌గానే పరిగణించబడు తారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వసాన్ని కాపాడేందుకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని, తోడ్పాటు నందించాలని కోరారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల,ఈమాన్, విశ్వసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు.ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్‌కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి,మజ్లీస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టులో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి,అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా,వాచా,ఖర్మనా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో మౌలాన వజిహోద్దీన్ లడ్డు, మౌలాన అబ్దుల్ మొయిజ్ షాంజి, మౌలాన ఇక్రామ్, మౌలాన ఇంతియాజ్ అసాధి,, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిష్జి, కలిమ్ షరీఫ్, హాఫిజ్ అబ్దుల్ రాఫె, పెద్దపల్లి పట్టణ, జిల్లా కు చెందిన ఇస్లామీయ ధార్మిక పండితులు పాల్గొన్నారు.

# మహబూబ్ ఘాట్ జలపాతం వద్దకు వెళ్లొద్దు : డీఎఫ్‌వో హెచ్చరిక



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు 01 :** నిర్మల్ పట్టణానికి సమీపంలోని మహబూబ్ ఘాట్ అడవుల్లో, సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో రానాపూర్ బీట్ పరిధి లో ఉన్న జలపాతాన్ని జిల్లా అటవీ అధికారి సందర్శించారు.ఈ సందర్భం గా జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో వరద నీరు జలపాతం లోకి చేరుతుండటంతో అక్కడ పరిస్థితు లు అత్యంత ప్రమాదకరంగా మారా యని తెలిపారు.అందువల్ల ప్రజలు, పర్యాటకులు జలపాతం వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.జలపాతం వద్ద గుమిగూడడం,స్నానాలు చేయడం, సెల్ఫీలు దిగడం వంటి చర్యలు ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి సాహసోపేత చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే,ఈ జలపాతం అటవీ ప్రాంతంలో ఉన్నందున అనుమతి లేకుండా ప్రవేశించడం,అటవీ నిబంధన లను ఉల్లంఘించడం వంటి చర్యలపై భారత అటవీ చట్టం మరియు అమలు లో ఉన్న అటవీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా అటవీ అధికారి స్పష్టం చేశారు. ప్రజలు తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, అటవీ శాఖ అధికారులకు సహకరించాలని జిల్లా అటవీ అధికారి విజ్ఞప్తి చేశారు.

# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

**-ఎస్పీ మహేష్ బి. గితే**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆగష్టు 01 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్నిశాఖల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 104మంది బాల బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన బాలలను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది జూలై 1 నుండి 31 వరకు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు.పోలీస్ శాఖతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, రెవెన్యూ, హెల్త్ శాఖలు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల కార్మికులను గుర్తించి సంరక్షణలోకి తీసుకున్నట్లు తెలిపారు.గుర్తించిన 104 మంది బాలబాలికలను సిడబ్ల్యూసి ముందు హాజరుపర్చి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం వారికి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. అలాగే 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని పనిచేయించిన యజమానుల పై 27 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతా యుతంగా కృషి చేయాలని ఎస్పీ కోరారు. బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి బాలలు కనిపించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# షీటీం పై విద్యార్థులకు అవగాహన ఉండాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 1 :** ప్రతి విద్యార్థికి షీ టీం పై అవగాహన ఉండాలి అని ఎస్‌ఐ లావణ్య అన్నారు.రామగుండం సి.పి ఆదేశాల మేరకు, పెద్దపెల్లి షీ టీమ్ వారు, గోదావరిఖని, అడ్డగుంటపల్లి లోని కాకతీయ జూనియర్ కాలేజీ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య మాట్లాడుతూ విద్యార్థుల ఎలా ఉండాలి, ఫోక్సో యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు , అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టి సేఫ్ ఆప్ వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లొ ప్రిన్సిపాల్ ఉపేందర్ గారు, మరియు ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు, సురేష్, మౌనిక, స్నేహలత పాల్గొన్నారు.

# జలసిరిలో భాగంగా బోర్వెల్ రీఛార్జి ఫిట్ పని ప్రారంభం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 01 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో జలసిరి పథకంలో భాగంగా ల్యాగల సుచరిత భూమిలో బోర్వెల్ రీఛార్జ్ కార్యక్రమాన్ని సర్పంచ్ కొండరమేష్ గౌడ్ ప్రారంభించారు.జలసిరిలో భాగంగా ప్రతి గ్రామంలో ఫాం పాండ్స్ ఇంకుడు గుంతలు తదితర పనులను చేసుకొని నీటిని వృధా చేయకుండా నిలువ చేసుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, బిల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, రైతు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, ఆగస్టు 01 :** హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ ఎన్ తుకారాంజీ గారికి జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె శనివారం స్వాగతం పలికారు.జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి.మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి చారి, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

## జిపి సిబ్బందికి శానిటేషన్ సామగ్రి పంపిణి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 01 :** ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం స్థానికసర్పంచ్ ఎలగందుల నరసింహులు చేతుల మీదుగా జూలై నెలకు గాను సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె,బెల్లం,శానిటేషన్ సామగ్రి పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్ వార్డు సభ్యులు కొత్త చెన్నయ్య అంగూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

**బొప్పాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి రెన్ కోట్స్ పంపిణి**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామం లో వర్షం కాలం సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి రెన్ కోట్స్ ను ఎంపీడీఓ సత్తయ్య సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి లు శనివారం పంపిణి చేశారు, ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌరీ శంకర్ కార్యదర్శి సంతోష్ వార్డుమెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పొదల తొలగింపు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 1 :** మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో పెరిగిన పొదలను సర్పంచ్ గుడిసె గట్టయ్య ఆధ్వర్యంలో తొలగించారు.కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని అక్క పెల్లి బొక్కల వాగు బ్రిడ్జి నుండి కన్నాల ఎక్స్ రోడ్ వరకు వెళ్లే రోడ్డు ఇరువైపులా చెట్లు ఎక్కువ కావడంతో ప్రయాణికులకు ఇబ్బంది పడుతుండడం చూసి గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ జెసిబి తోని ఇరువైపుల చెట్లను తొలగించడం జరిగింది. దీనితో ప్రయాణికులు ఊపిరిపించుకున్నారు తరచూ రోడ్డు యాక్సిడెంట్లు కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## మొక్కలు నాటుదాం...
## కాలుష్యాన్ని నివారిద్దాం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 1 :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించే బాధ్యత మనందరిపై ఉందని పేరాపల్లి సర్పంచ్ బొంగొని సదయ్య గౌడ్ అన్నారు. శనివారం కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బొంగోని సదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఎస్ హెచ్ ఎస్ మహిళలు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు."ప్రతి ఇంటా ఒక మొక్క -- ప్రతి మనిషికి పచ్చని భవిష్యత్తు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని మనవి చేస్తున్నాము అని సర్పంచ్ అన్నారు.

# నాణ్యమైన విద్యా బోధన కోసమే ఉపాధ్యాయులకు శిక్షణ

**-హుజురాబాద్ ఎంఈఓ విడపు శ్రీనివాస్**
**-ముగిసిన శిక్షణ తరగతులు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 1 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కాలానుగుణంగా నాణ్యమైన విద్య అందించేందుకే శిక్షణ కార్యక్రమాలు ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహిస్తోందని హుజురాబాద్ ఎంఈఓ విడపు శ్రీనివాస్ అన్నారు. హుజురాబాద్ మండలంలో మూడు రోజులపాటు జరిగిన రెండో విడత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి.



స్థానిక మండలంలో రెండవ స్పెల్ కు సంబంధించి 39 మంది ఉపాధ్యాయులకు జూలై 30 నుండి ఆగస్టు ఒకటి వరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ. ఉపాధ్యాయులు అకాడమిక్ పరంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి తెలుగు, ఆంగ్లము, గణితంలో రెమిడీయల్ బోధన విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని స్థానిక మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ప్రతి విద్యార్థి పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని, వారికి అర్థం కాని విషయాలను ఓపికతో బోధించాలని కోరారు. శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లను ఎంఈఓ అభినందించారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతి అంశాలను తమ పాఠశాలలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఊరుగొండ సత్యప్రసాద్, రిసోర్స్ పర్సన్స్ అల్లి శ్రీనివాస్, పట్టెం శ్రీనివాస్, తంగళ్ళపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిఆర్పి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



### లింగ వివక్షతతో పాటు సమాజంలో
# కొనసాగుతున్న అసమానతలను నిర్మూలిద్దాం

**-సమ భావనతో కూడిన నూతన సమాజనిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిద్దాం**
**-ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 01 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జ్ పుట్ట రవి మాదిగ నాయకత్వం లో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి అందే శామ్యూల్ మాదిగ అధ్యక్షతన మాదిగ కుల బంధువులు యువకుల తోటి సమావేశం నిర్వహించడం జరిగిందిఈ సమావేశంలో ఎమ్మెస్ పి నాయకులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని అందరి సమక్షంలో



ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌతమ బుద్ధ మొదలు సంత్ రవిదాస్ వరకు పూలే నుండి మొదలు అంబేద్కర్ జగిజీవన్ కాన్షిరామ్‌లు వారి వారి జీవితకాల మంతా సమాజంలో కొనసాగుతున్న అన్ని రకాల అసమానతలు తొలగి పోవాలన్నారు. ఈనాడు ఎస్సీ ఎస్టీలతో పాటు బీసీ మైనారిటీ అలాగే అగ్రకులాలలోని పేదలు ఎంతో కొంత స్వేచ్ఛను పొందుతున్నారంటే అది కూడా ఆ మహనీయులు నాడు కొనసాగించిన పోరాట ఫలాలే అనేది ముమ్మాటికి వాస్తవం.దేశంలో ప్రపంచంలో జనాభాలో సగమైన మహిళలు అనునిత్యం వివక్షతకు దాడులకు అవమానాలకు హత్యలకు అత్యాచారులకు గురవుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆ మహనీయులు కలలుగన్న నూతన సమాజ నిర్మాణం కై మనమంతా చిత్తశుద్ధితో పని చేద్దాం. అందుకోసం ఇప్పటికే మనకున్న సంఘాలన్నీ ఈ కృషిలో ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంది.పద్మశ్రీ గౌరవ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నాం మనకు 9%రిజర్వేషన్లుకేటాయించడం జరిగింది.అందుకని మన మాదిగ బిడ్డలు మంచిగా చదువుకొని ఉన్నత మైన ఉద్యోగాలు సాధించే విధంగా గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్ నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ, అందే సురేష్ మాదిగ అధ్యక్షులు అందే దేవ రాజు మాదిగఉపాధ్యక్షులు అందె భరత్ మాదిగ ప్రధాన కార్యదర్శి మండే రాజు మాదిగకార్యదర్శి అందేసంతోష్ మాదిగ సంయుక్త కార్యదర్శి అందే రాజు మాదిగ కార్యవర్గ సభ్యులు మార్వాడి వంశీ మాదిగ దానం చంద్రకాంత్ మాదిగ నల్ల పోచయ్య మాదిగ అందే పెద్ద మల్లయ్య మాదిగ నరసయ్య మాదిగ దాసరి నరసయ్య మాదిగ బొల్లి లింగయ్య మాదిగ అందే బాలయ్య మాదిగఅంబేద్కర్ సంఘ నాయకులు సులబాంధవులందరూ పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడ్డ వారిపై కఠిన శిక్షలు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 1:** ర్యాగింగ్ కు పాల్పడిన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలులో వున్నాయి.ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది అన్నారు.శనివారం మండల న్యాయ సేవ సమితి ఆధ్వర్యాన జేఎన్టీయు మంథని ఇంజనీరింగ్ కళాశాల లో ర్యాగింగ్ పై న్యాయ విజ్ఞాన సదస్సు లో మంథని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది మాట్లాడుతూ యుజిసి మార్గదర్శక ప్రకారం విద్య సంస్థలలో ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలతో పాటు,అనేక మార్గదర్శకాలు అమలులో ఉన్నాయని,ఎవరేని వ్యక్తులు తోటి విద్యార్థులపై కళాశాల ప్రాంగణంలో, బయట ర్యాగింగ్ కు పాల్పడితే చట్ట



ప్రకారం కఠిన శిక్ష లు పడతాయని, ర్యాగింగ్ అనైతిక చర్య,అమానవీయం అని పేర్కొన్నారు,భారతీయ సంస్కృతి లో ఇలాంటి చర్య లకు అవకాశం లేదని సత్ప్రవర్తనతో చట్ట బద్ధంగా మెసలు కోవాలని కోరారు,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.రఘోతంరెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ పాశ్చాత్య సంస్కృతని,మనం చట్ట బద్ధమైన పౌరులుగా ఇతరుల హక్కులకు బంగం వాటిల్ల కుండా జాగ్రత్త గా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్ర మంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఆర సుదా రాణి,ద్వితీయ శ్రేణి న్యాయ మూర్తి అనురాధ,బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, న్యాయ వాదులు శశిభూషణ్ కాచె,నూనేటి ఆంజనేయులు,సి.ఐ.బుద్దే స్వామి, ఎస్.ఐ.టి.శ్రీనివాస్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సువర్ణ ప్రనీత్,జె.ఎన్టీ ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రచారం కోసం డ్రామాలు ఆడొద్దు

**-డిప్యూటీ మేయర్ సునీల్ రావుకు 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న ఘాటు హెచ్చరిక**
**-11 డివిజన్ అభివృద్ధి మాదే బాధ్యత**
**-కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్, ఆగస్టు 1:** 11వ డివిజన్ అభివృద్ధిపై డిప్యూటీ మేయర్ సునీల్ రావు చేస్తున్న ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించే చౌకబారు రాజకీయ ప్రచారమేనని 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న మండిపడ్డారు. శనివారం మీడియాతో కార్పొరేటర్ మాట్లాడారు. మేయర్‌గా పూర్తి అధికారాలు చేతిలో ఉన్నప్పుడు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోని వ్యక్తి, ఇప్పుడు తానే అభివృద్ధి చేయిస్తానని చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమే అని ఆమె విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం అష్యూరెన్స్ కింద నిధులు మంజూరైనా, పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపని వారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసే దశకు తీసుకురాగానే వినతిపత్రాలు తీసుకుని ఫోటోలు దిగుతూ ప్రచారం చేసుకోవడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక చొరవతో 11వ డివిజన్‌కు అవసరమైన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇతర అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. ఇతరుల కృషిని తన ఖాతాలో వేసుకోవడం రాజకీయ నీతికాదు అని ఆమె అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎవరు పని చేస్తున్నారో, ఎవరు కేవలం ప్రచారం చేస్తున్నారో వారికి స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు. "సునీల్‌రావు గారు... ముందుగా మీ డివిజన్ సమస్యలను పరిష్కరించండి. ఇతర వార్డుల అభివృద్ధిపై రాజకీయాలు చేయడం మానండి. డిప్యూటీ మేయర్ హోదా అంటే అన్ని వార్డుల పనులకు క్రెడిట్ తీసుకోవడం కాదు"అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. 11వ డివిజన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం తమ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సహకారంతో అవసరమైన నిధులు తీసుకొచ్చి అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడమే మాలక్ష్యం. ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వడం కాదు. అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతాం. ప్రజల విశ్వాసమే మా బలం, చౌకబారు రాజకీయాలు కాదు అని కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న పేర్కొన్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు సహకారంతో 15వఆర్థిక సంఘం నిధుల ద్వారా సుమారు రూ. 1కోటి వ్యయంతో కట్టరాంపూర్-గిద్ద పెరుమాండ్ల దేవాలయం-కోతిరాంపూర్ వరకు మంచినీటి పైపులైన్ పనులు చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. అదేవిధంగా కట్టరాంపూర్ నుంచి లేక్ పోలీస్ స్టేషన్ వరకు మంచినీటి పైపులైన్ పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1 కోటి రూపాయలు మంజూరు అయ్యాయనీ, త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తిస్థాయి లో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని చెప్పారు. గతంలో వార్డును అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశాము. ఇప్పుడు కూడా అదే విధంగా మరింత అభివృద్ధి చేస్తాం. ప్రజలకు మా మీద నమ్మకం ఉంది అని కార్పొరేటర్ పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ పదవి చట్టపరంగా కార్పొరేటర్ హోదాతో సమానమే. దానికంటే ఎక్కువ అధికారాలు లేవు. అలాంటప్పుడు ఏ హోదాలో మా వార్డుతో పాటు ఇతర వార్డుల్లో తిరుగుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు? మరోసారి ఇలాంటి రాజకీయ డ్రామాలతో మా డివిజన్‌లో కనిపిస్తే ప్రజలే తగిన విధంగా గట్టి బుద్ధి చెబుతారు. అవినీతి రాజకీయాలకు 11వ డివిజన్‌లో చోటు లేదు అని కార్పొరేటర్ స్పష్టం చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 1 :** జిల్లాలోని ప్రజలకు ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓ.పి సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని, ఆసుపత్రి లో అటెండెన్స్ బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ, వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్స్పైర్ అయినటువంటి మెడిసిన్ ఉండకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్లను పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఉన్న మంచినీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు నాణ్యతమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ, ఎమ్మార్వో, ఎంపిడివో, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లంపల్లి నీటిని వరద కాల్వకు విడుదల చేసిన

# మంత్రికి జువ్వాడి నర్సింగ్‌రావు కృతజ్ఞతలు

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 01 :** సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాంపూర్ పంప్‌హౌస్ ద్వారా వరద కాల్వకు రివర్స్ పంపింగ్ ద్వారా శనివారం నీటిని విడుదల చేయడంపై తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. సుమారు వారం రోజుల క్రితం బాల్కొండ, వేములవాడ, కోరుట్ల నియోజకవర్గాలకు చెందిన సుమారు 500 మంది రైతులు ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయాలని జువ్వాడి నర్సింగ్‌రావును కోరారు. రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఆయన ఈ అంశాన్ని జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సునీల్ రెడ్డితో సమన్వయం చేసి సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధికారికంగా లేఖ అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. ఈ నీటి విడుదలతో వేములవాడ, కోరుట్ల, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో భూగర్భ జలాల మట్టం పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని జువ్వాడి నర్సింగ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి జువ్వాడి నర్సింగ్‌రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## వీణవంక కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా కుమార్



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్ట్ 01 :** వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు (ఎఫ్‌సిఏ)గా జమ్మికుంట ప్రిన్సిపాల్ ఎం. కుమార్ పదవి బాధ్యతలు శనివారం రోజున చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంవత్సరము ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆగస్టు 15తారీకు వరకు ఉన్నందున అడ్మిషన్లు పొందని విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. కుమార్ ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శాలువాతో సత్కరించి సన్మానించారు.

## నిరసనలో లేము.. విధుల్లోనే ఉన్నాం...



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 1 :** జెఏసి ఏర్పాటు చేసుకొని ఏపీవోఎస్, ఈసీఎస్, టీఏఎస్, సీవొఎస్ అందరూ కలిసి చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో మల్లాపూర్ మండల ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని నిరసన కార్యక్రమాల్లో మేము లేము విధుల్లోనే ఉన్నామంటూ శనివారం ఎంపీవో మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వీబీజీ ఆర్ఎంఎం జీ లాగిన్ అన్ని మార్చినందున మాకు డిమాండ్ చేసుకోవడానికి ఇబ్బంది ఉన్నందున మాకు లాగిన్ ఇచ్చినట్లయితే మేము డిమాండ్ తో పనులను యధావిధిగా కొనసాగిస్తామని వారిచ్చిన వినతిపత్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దండు రాజన్న, పెసరి రాకేష్, జంగం దినేష్, శ్రీనివాస్, మమత, లావణ్య, గంగారాం, నరేష్, సుజాత, సురేష్, క్రాంతి, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత



**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఆగస్టు 1 :** గొల్లపల్లిలోని గాయత్రి కోపరేటివ్ బ్యాంకులో ఖాతా ఉండి చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కు ను తహసీల్దార్ అబ్దుల్ మజీద్ శనివారం అందజేశారు. గాయత్రి బ్యాంకు గొల్లపల్లి శాఖలో రెడపాక లచ్చవ్వ నిర్భయ సేవింగ్ ఖాతాలో పొంది ఉండి ప్రమాదవశాత్తు లచ్చవ్వ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులైన రెడపాక రాజేందర్ కు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నేరెళ్ల మునిందర్, వినయ్ కుమార్, చంద్రశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే మాజీ మంత్రులు,బిఆర్ఎస్ నాయకుల కోటిలింగాల పర్యటన

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్01 :** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలిం గాల కోటేశ్వరస్వామి ఆలయ సందర్శనఎల్లంపల్లి గోదావరి బ్యాక్ వాటర్ పరిశీలన, ధర్మారం మండలం మేడారం నంది పంప్ హౌజ్ పర్యవేక్షణ కోసం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు,మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి,మాజీ జెడ్పీచైర్‌పర్సన్ దావవసంత, మాజీడిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, తదితర నాయకులు పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు చల్లూరి రాం చంద్రం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు

**-కాంగ్రెస్ హయంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన**
**-రూ. 12 కోట్లతో ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు**
**-నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు**
**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 1 :** పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మరియు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాధికారులతో మరియు స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు చేశారు. ముందుగా పెద్దపల్లి మండలం లోని తుర్కల మద్దికుంట గ్రామంలో పెద్దపల్లి నుండి చొప్పదండి వరకు అదనపు నూతన బస్సును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి తదుపరి పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో మరియు హాస్పిటల్ సూపరిండెంట్, హాస్పిటల్ అభివృద్ధి కమిటి సభ్యులతో కలిసి ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాసం అందుతుందని రూ. 12 కోట్లతో పెద్దపల్లి పట్టణంలో మరియు మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రూ.26లక్షలతో మరియు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ.20లక్షల నిధులతో విద్యార్థులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తున్నారని కానీ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు గొప్ప చదువులు చదువుకొని నైపుణ్యం కలిగిన వారని వారందరూ తమ విద్యార్థుల పట్ల ప్రేమతో మేలుగుతున్నారని దానికి నిదర్శనమే మొన్న వచ్చిన పదోవ తరగతి ఫలితాలని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పోటీ పడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతున్నాయని బడుల్లో మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థుల ఆకలి తీర్చేందుకు టిఫిన్ కూడా అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఉంటుందని వారందరూ పూర్తి బాధ్యతాయుతంగా ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు,హాస్పిటల్ సూపెరడెంట్ ,ఆర్టీసీ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్, సర్పంచ్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సిటీ కేబుల్ ఎండీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయండి



చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు, 01 : రాష్ట్రంలో ఉమ్మడి తొమ్మిది జిల్లాలలో కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో గత 40 సంవత్సరాలు ఒక్కొక్క ఉద్యోగి పనిచేసే పదవి విరమణ చేసిన తర్వాత వారికి నెలకు పెన్షన్ మంజూరి కాక వారి కుటుంబాలు అనేక రకాల మానసికంగా కుమిలిపోతున్నారు అని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల గజిటెడ్ నాన్ గజిటెడ్ ఉపాధ్యాయులు పెన్షనర్లు మరియు కార్మికుల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులకు ప్రతినెల వారి కుటుంబానికి ఆదుకోవడానికి మరియు వారికి ఆరోగ్యం చెడిపోయినట్టయితే వారు ట్రీట్మెంట్ తీసుకున్న పరిస్థితుల్లో కూడా వారి ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆ ఉద్యోగులు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు కావున తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల సంక్షేమం కొరకు కృషి చేస్తుంది కనుక అలాంటప్పుడు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల పెన్షనర్లకు కూడా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు 40 సంవత్సరాలు రైతులకు ప్రజలకు ప్రతి ఒక్కరికి ఎన్నో రకాల సేవలు చేసిన ఈ ఉద్యోగుల సేవలను గుర్తించి వీరికి కూడా ప్రతి నెల పెన్షన్ మంజూరి చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు లకు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో పనిచేసే 40 సంవత్సరాలు సేవలు అందజేసి పదవి విరమణ పొందిన ఉద్యోగ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వారికి ప్రతి నెల ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం తీసుకొని వారికి నేల ఒకటికి చొప్పున కొంచమైనా ఆర్థిక సహాయం చేసినట్లయితే ఆ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ రిటైర్మెంట్ ఉద్యోగులు జీవిత కాలం ఈ ప్రభుత్వానికి గుర్తించుకుంటారని కావున వారిని ఆదుకోవడానికి తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రులందరూ ఒక నిర్ణయం తీసుకొని వీరికి ప్రతినెల కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో పనిచేసే పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబాలు జీవితకాలం జ్ఞాపకం చేసుకుంటారని మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు ప్రతిరోజు ఏదైనా వార్త రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కోపరేటివ్ బ్యాంకులో పనిచేసి పదవి విరమణ చేసిన ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు కనుక వారి యొక్క ఆశలను నిరాశ చెందకుండా వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్న ఆ పథకాలలో ఈ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో పనిచేసి పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కూడా ఒక స్కీములో వారికి కూడా ప్రతి నెల పెన్షన్ ఇచ్చినట్టు ఒక స్కీం మంజూరు చేసినట్లయితే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు కు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు ఇప్పటికీ గుర్తించుకుంటారని మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు.

# మండల బిజెపి అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 1 :** కమాన్ పూర్ మండల బిజెపి అధ్యక్షుడు కొయ్యడ సతీష్ పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో క్రీడ సతీష్ పుట్టినరోజు సందర్భంగా బిజెపి నాయకుల సమక్షంలో కేక్ ను కట్ చేశారు. అనంతరం కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు కొయ్యడ సతీష్ కు పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మట్ట శంకర్ ,మచ్చగిరి రాము, జంగిపల్లి అజయ్, మల్లారం, పెద్దపల్లి శ్యామ్, తోపాటు భారీ ఎత్తున కార్యకర్తలు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు

# పెండింగ్ సాగునీటి పనులు పూర్తి చేస్తాం



**-గత ప్రభుత్వం సాగునీటి అవసరాలు పట్టించుకోలేదు**
**-స్తంభంపల్లి చెరువును పరిశీలించిన మంత్రి అడ్లూరి**

**చురకలు,విలేఖరి, వెల్గటూర్,ఆగస్టు 01 :** ధర్మపురి నియోజకవర్గం గోదావరి పక్కనే ఉన్నప్పటికీ గత ప్రభుత్వ కాలంలో రైతులకు అవసర మైన సాగునీటి పనులను పట్టించు కోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ ఆరోపించారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామ పెద్ద చెరువును రాష్ట్ర మంత్రి అడ్లూరి పరిశీలించారు. 2014లో తెలంగాణ రాష్ట్రంఏర్పడిన తర్వాత ధర్మపురి నియోజక వర్గంలోనిరైతుల అవసరాలకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యంచేశారని, నియోజక వర్గంలో కీలకమైన రోళ్ళవాగుప్రాజెక్టు అంచనాలు పెంచి ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కాగితాలకే పరిమితమైనట్లు మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశల వారీగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రోళ్ళ వాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తున్నామని అక్కపల్లి లిఫ్ట్ పనులుపూర్తిచేసి 2027 జనవరి 27 వరకు నీటిని ఎత్తి పోస్తామని మంత్రి తెలిపారు. స్తంభంపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు స్థంభంపల్లి చెరువు మత్తడి మరమ్మత్తు, తూములవెడల్పు మరమ్మతుకు రూ. 5 లక్షలకేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. గొల్లపల్లి మండలంలోని యశ్వంత రావుపేట చెరువు పూడికతీత పనులుపూర్తిచేస్తామనిమంత్రి తెలిపారు. మేడారం రిజర్వాయర్ నుండి ముంజం పల్లి,మారేడుపల్లి గ్రామాలకు సాగు నీటిని అందించడానికి చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. బొమ్మరెడ్డి పల్లి కొత్తపల్లి వరకు కాల్వ పనులు పూర్తిచేస్తామని నియోజకవ ర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన జగిత్యాల బార్ అసోసియేషన్



**చురకలు విలేకరి,ధర్మపురి, ఆగస్టు 1 :** తెలంగాణ హైకోర్టు ద్వారా జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయానికి అదనంగా ఫ్యామిలీ కోర్ట్ మరియు అదనపు మున్సిఫ్ కోర్టు మంజూరు అయ్యాయని వాటి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులు మంజూరు కు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు ధర్మపురి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నూతనంగా మంజూరైన కోర్టులు నిర్మాణమై అందుబాటులోకి వచ్చినట్లయితే జిల్లా ప్రజలకు త్వరితగతిన కేసులు పరిష్కారమయి కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఆర్థిక,న్యాయశాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాలబార్ అసోసియేషన్ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు ఎర్ర నర్సయ్య, మర్రిపెల్లి సత్యప్రకాశ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది రాచకొండ శ్రీరాములు న్యాయవాది గొంటి కిరిటి, ఎజిపి ఇమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.